

# అనగనగా...కథలు - డా.శైలజ చందు



## వడ్డన్ చత్రం

**రాత్రికి రాత్రి ఘోరం** జరిగిపోయిందని అరుస్తోంది ప్రియ. అన్యాయం జరిగినపుడు ఆమె భద్రకాళి అవుతుంది.

ఇంత నీతిలేని మనుషులుంటారని ఆమె కలలోనైనా వూహించ లేదట. తననింత క్షోభకు గురి చేసినవారు బాగు పడరని రంకెలేస్తోంది.

ఆమె కోపానికి కారణమైన జయరాం, తాపీగా చేతులు తుడుచుకుంటూ వచ్చాడు. తప్పు చేశామనుకున్నపుడు బలవంతాన ఆవహింప జేసుకునే అతి తాపీదనం కనబడుతోందతనిలో .

అక్కడున్న వెదురు కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని, కిషోర్ కుమార్ పాట హమ్ చేస్తున్నాడు. ఖూనీ చేసొచ్చి కూని రాగం తీస్తున్నట్టు.

అతన్ని చూడగానే ప్రియ ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. నర్సులు, పేషంట్లు, వారి బంధువులూ అందరూ చూస్తుండగానే, అతనికెదురుగా నిలబడి,

" జయరాం, నీకసలు సిగ్గుందా? మనిషివేనా? ఎతిక్స్ లేకుండా"

ఆమెను మధ్యలోనే ఆపేసి, "ఆగాగు. ఎతిక్స్ తప్పి నేనేం చేశాను. సరైన కారణముంది గనకే చేయాల్సి వచ్చింది."

"ఏంటా కారణం? చూపెట్టు."

"బిడ్డ గుండె చప్పుడు నాకెందుకో తేడాగా అనిపించింది. అందుకని ఆపరేషన్ చేశా"

"తెల్లవారుజామున పేషంటుని నిద్రలేపి, బిడ్డి హార్ట్ రేట్ తీసుకోవాల్సిన అవసరమేమొచ్చింది?"

"చూడు ప్రియా, డ్యూటీలో వున్నపుడు పేషంట్లని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత నాది."

"అబ్బో, ఎంత రెస్పాన్సిబిలిటీ?"

గొంతులు పెంచి మాటలు విసురుకుంటున్నారు.

ఆ రోజు వుదయం ఏడింటికి ఒక ఆపరేషన్ చేద్దామనుకుంది ప్రియ. పరీక్షలు, ముందస్తు ఎనెస్థీషియా చెక్ అప్ దగ్గరుండి చేయించింది. బ్లడ్ కూడా అరేంజ్ చేసింది.ఉదయాన్నే ఆరుంబావుకు అమ్మవారి కుంకుమ పెట్టుకుని వార్డుకొచ్చి చూస్తే, బెడ్ మీద పేషంట్ లేదు. ఆపరేషన్ థియేటర్లో వుందన్నారు.ఎవరు చేస్తున్నారని కనుక్కుంటే, రాత్రి డ్యూటీలో వున్న జయరాం.

తెల్లవారు జామున 5:30 కు పేషంట్ని, థియేటర్ షిఫ్ట్ చేసి ఆపరేషన్ చేసేశాడు. తగాదా ముదిరాక ఇంగ్లీషు భాషలో మురికి పదాలు వాడుకోక తప్పలేదు.

అలా అందరి ముందూ గొడవపడడం చిన్న విషయమేమీ కాదు. పైగా పెద్ద నర్సు వనజ గారి సమక్షంలో. ఆమె మా ప్రొఫెసర్ కు ప్రధాన వేగు. ఆయనకీ విషయం తప్పకుండా తెలుస్తుంది. ఇక ఆపై వూహించుకునే ధైర్యం లేదు మాకు.

అందరిదీ ఒకే సమస్య. మూడేళ్లు అయిపోయేలోపల వీలైనన్ని ఎక్కువ కేసులు చేయాలని, అనుభవం సంపాదించుకోవాలన్న దాహం.

కానీ కేసులేవీ? ఒకే కేసు, వందమంది యోధులు.ప్రతి కేసుకీ ఎంతో పోటీ వుండేది. ఈ కేసుకి నేను చేసుకుంటానంటే నేను చేసుకుంటానని పేచీలు పడేవాళ్లం. నా వంతంటే నా వంతని గొడవలు.

రేపుదయాన్నే చేసుకుందామని కర్చీపు వేసుకున్న కేసుని , రాత్రికి రాత్రి కబ్జా చేసేవాళ్లు. పొద్దున్నే పోరాటాలు, రభసలు, అలకలు, మౌన పోరాటాలు.

కలకత్తా కౌటిల్యత, మళయాళీ కంగాళీయం, షెరి షెరి పిన్నెత్వం, ఢిల్లీ బుల్లీయింగు, మా కోడిపుంజు తత్వం. డిపార్ట్మెంట్ లో కత్తులు దూసుకునే పరిస్థితి!

గొడవ విచారణకు రానే వచ్చింది. ప్రొఫెసర్ ఆఫీసులో కలవమంటూ మాకు తాఖీదులొచ్చాయి. ఆ గదిలోకి ఒక్కరే వెళ్లాల్సి వస్తే, ప్రాణాలు అరువు తీసుకుని అడుగుపెట్టే వాళ్లం.

అందరం గుంపుగా నడుచుకుంటూ పోయాము.

వెళ్లే దారిలో జయరాం, తాను అతి కూల్ గా కనిపించడానికి నానా తిప్పలు పడుతున్నాడు. ఆనాడు తాను ఆపరేషన్ చేయడం సరైన నిర్ణయమేనని నిరూపించడానికి లైబ్రరీ నుండి జర్నల్స్ తెచ్చాడు. వాటితోనే, గాలి విసురుకుంటున్నాడు. ఈ గొడవ, ఏనుగు మీద కూర్చున్న దోమ వంటిదని స్టేట్మెంట్లిస్తున్నాడు. పక్కవారితో అకారణంగా పకపక లాడుతున్నాడు. ప్రియను మరింత చిర చిరలాడించడానికి చేతనైనన్ని విద్యలు ప్రదర్శిస్తున్నాడు.

ప్రియ, జయరామ్ కు వినిపించేలా కణ కణలాడుతూ ఖయ్యిమంటోంది. తనతో బాటు నడుస్తున్న వారితో

“జయరామ్ అరాచకాలన్నిటినీ లిస్ట్ రాశా. ఇవాళ సార్ చేతిలో వాడి వీపుగిలించకపోతే రేపణ్ణుంచి నా పేరు తిరగదిప్పి పలకండే ” అంది. చుట్టూ వున్న ముత్తైదువలు తలలూపుతూ ‘యప్రి, యప్రి’ అనుకున్నారు.

సార్ రూము దగ్గరకెళ్లేప్పటికి అందరం పిల్లుల్లా మారాము. సార్ ది వెన్న వంటి స్వరూపం. అతి సూటి ముక్కు. తెల్లని చొక్కాలో దేవదూతలా కూర్చుని వున్నారు. మేమంతా అప్పుడే నరకం నుండి రిలీజైన నేరస్థులవలె దుమ్ము కొట్టుకుపోయి, జిడ్డోడుతూ నిలబడ్డాము. వేరే వారిమీద ఎత్తిపోయడానికి గంపెడు దుమ్మూ, సొంత బాధ చెప్పుతూ భోరుమనడానికి గుండిగ కన్నీళ్లతో అందరం సిద్ధంగా వున్నాము.

ఆయనవేమీ అడగలేదు. టై సవరించుకుని మెత్తగా మాట్టాడారు.

“మీ అందరికీ మెరుగైన ట్రైనింగ్ అవసరం. బిజీ హాస్పిటల్లో పని చేస్తే భవిష్యత్తులో బాగుంటుంది. అందుకోసమని ఒక హాస్పిటల్ ని ఎన్నిక చేశాను. అక్కడ డైరెక్టర్, డా. పౌల్ ఎమ్మానుయేల్ నా స్నేహితుడే. నెలకొకరు చొప్పున డెప్యుటేషన్ మీద వెళ్లి రండి. మొట్ట మొదట వెళ్ల వలసిన రెండు మూడు పేర్లు నేను నిర్ణయిస్తాను. మిగిలిన లిస్ట్ సెక్రటరీ తయారు చేస్తుంది.”

ఎక్కడికి?

“ఎక్కడికి సార్, ఎక్కడికండీ?” అని అడగ్గల ఆర్ నారాయణ మూర్తులెవరూ లేరు మా బాచ్ లో. ఏప్రాన్ కింద తోకలు జాగ్రత్తగా ముడుచుకుని బయటికొచ్చాము.

వడ్డన్ చత్రం మిషనరీ హాస్పిటల్! దిండిగల్ జిల్లా , తమిళనాడులో వుంది.అదొక బిజీ హాస్పిటల్.

ఓపెనింగ్ బాట్స్ మాన్ గా, సీనియర్లలో పెదరాయుడైన సలీమ్ ని పంపించారు. ఓ నెలరోజుల తర్వాత దుక్కవంటి పెదరాయుడు , చిక్కి చినరాయుడై వచ్చాడు. కెఫెటేరియా ఎదురుగా వున్న గట్టు మీద కూచున్నాడు. అందరం చుట్టూ మూగి కొద్ది దూరంలో నిలబడ్డాము.

“ఏంటన్నా ఇలా అయ్యావు?”

మంత్ర శక్తులు పొందిన సిద్ధునిలా నవ్వాడు.

“అన్నా, అక్కడెలా వుంది? నీకు ఛాన్సులు దొరికాయా?”

“దొరికేదేంట్రా. వద్దంటే డబ్బు, మెకన్నాస్ గోల్డూ, రోజూ అవే సినిమాల్రా.” ఆ లెక్కలు , స్టాటిస్టిక్స్ చెప్తూ మా చెవుల్లో పంచామృతాలు పోంపాడు.

“అదొక స్వర్గమేరా.” అన్నాడు.

“మరి ఇంద్రుడు, రంభా , గింభా?”

"వున్నార్రా, మారు వేషాల్లో పని చేస్తున్నారక్కడ.”

“ఒరేయ్ ,అక్కడ డాక్టర్లున్నార్రా, మొనగాళ్లురా భాయ్. ఇక్కడ మనం ప్రళయమన్నంత బిల్డ్ అప్ ఇచ్చే కేసుల్ని, మూడు ముక్కల్లో తేల్చేస్తారు. వాళ్ల దగ్గర నేర్చుకోడానికి బాబో, చాలా వుందిరోయ్.”

ప్రవచనాలు వింటున్న శిష్యులనుభవించే ట్రాంక్విలిటీ లో మాట్టాడకుండా వింటున్నాం. ఆ హాస్పిటల్ గురించి చెప్తుంటే , ఎడారిలో అలమటించేవాడికి జలపాతం గురించి వర్ణించినట్టే వుంది.

ఎవరెవరు ఎప్పుడెళ్తున్నారో కనుక్కున్నాడు. నా వంతు నాలుగైదు నెలల తర్వాత వచ్చిందన్నాను.

"ఏయ్ పిల్లా, చీరలెత్తుకెళ్లకు. పనిమనిషికిచ్చేద్దామనుకున్న పాత డ్రెస్సులు మూడో నాలుగో మూట కట్టుకో. ఒక రిన్ సబ్బు కూడా.”

“అన్నా , అరవం రాదుగా మనకు?”

“నువ్వేమైనా అరవ సినిమా లిరిక్స్ రాయాలా? రెండో నాలుగో ముక్కలు పేషంట్లే నేర్పుతారు. అయినా పేషంట్లతో మాట్టాడే టైముండదురా. సునామీలో సిగిరెట్టు వెలిగించే ఫుర్సత్ ఎక్కడ? ఒరేయ్ ఇది స్విమ్మింగ్ పూల్.

అది సముద్రం రా. ఆ ఈతే వేరు.”

సంతృప్తితో పొట్ట మీద రుద్దుకుంటూ చెప్పాడు. .

నాలుగైదు నెలలు గడిచాక నా వంతు వచ్చింది.

కోయంబత్తూర్ నుండి మదురై వెళ్లే ట్రెయినెక్కి మధ్యలో ఒడ్డన్ చత్రంలో దిగాను. మిషనరీ హాస్పిటల్ చాలా ఫేమస్. హాస్పిటల్ ముందు ఆటో దిగి లోపలికెళ్తుంటే, "అక్కా , అక్కా" అన్న పిలుపు వినిపించింది.

ఈ వూళ్ళో నా తమ్ముడెవరా అని చూస్తే , మా జూనియర్ రాజేష్. పోయిన్నెల అతనిదే, ఇక్కడ పోస్టింగ్. వాడింకా పోకుండా ఇక్కడే వున్నాడే? కేసులకు పోటీ వస్తాడా ఏం ఖర్మ? పొద్దున్నే తెల్లకాకిని చూసినట్టు మొహం మాడ్చేసుకున్నా.

"రా అక్కా, రా" అంటూచాలా అభిమానంగా పలకరిస్తున్నాడు. మణిపాల్ లేడీ డాక్టర్లకో గది కేటాయించారట. నేనొచ్చిన విషయం ఆఫీసులో చెప్పి తాళం తెచ్చాడు.

తాళం నా చేతికిచ్చి, “అక్కా సామానదీ లోపల పెట్టుకు రా, నేను కాంటీన్ చూపిస్తా” అన్నాడు.

అదొక డాబా ఇల్లు మోస్తరుగా వుంది. పెద్ద వరండా, నాలుగైదు వరుస గదులు. నాది మూడో గది. పక్క గదుల్లో వేరే లేడీ డాక్టర్స్ వుంటారట. తలుపు తెరిచి చూస్తే, గదిలో ఒక పెద్ద ఇనప మంచముంది. గది మొత్తం మంచమే. పక్కన కొద్దిగా చోటుంది కానీ, నడవాలంటే అడ్డం తిరిగి అడుగులు వేయాలి. గళ్ల దుప్పటి, గట్టి దిండు.

వెనక ఇంకోగది వుంది. అదేమిటో చీకటి కొట్టులా వుంది. మధ్యలో దణ్ణెం కట్టి వుంది. దానికి ఆనుకుని బాత్ రూమ్, పక్కనే ఒక ఏట వాలు బండ. బట్టలుతుక్కోవడానికి.

కాంటీన్ వైపు వెళ్తుంటే, "అక్కా, ఎంత తెచ్చుకున్నావు?"అడిగాడు డా. రాజేష్.

నీకెందుకు అనబోయి "మూడు వేలు." అన్నాను.

నడుస్తున్న వాడిలా ఆగిపోయి, నోటిమీద చెయ్యుంచుకుని "మూడువేలా?" అన్నాడు.

"ఏం, చాలవా?"

డబ్బింగ్ సినిమాలో కామెడీ సీన్లక్కూడా నవ్వేవాడిలాగా ఒకటే పొట్ట పట్టుకుని నవ్వుతున్నాడు.

"ఏమొచ్చింది, అంతగా నవ్వుతున్నావు?"

"అంతెందుకక్కా. అన్ని డబ్బులేంజేసుకుంటావు? మరీనూ!" అంటూ విసుక్కున్నాడు.

బెనారస్ శాలువా కప్పుకున్న ఎస్. వరలక్ష్మిలాగా, నాక్కూడా రిచ్ ఫీలింగుతో వుక్క బోసింది.

"ఇక్కడ లైఫెంత చీపో తెలుసా?" అని అక్కడి మనుషుల గురించి చెప్పాడు. ఊరి వారంతా మర్యాద రామన్న కాలపు వారట.

మంచినీళ్లడిగితే మరచెంబులో పాయసం పోసి ఇస్తారట.

"సరేలే కానీ, నువ్వెప్పుడెళ్తావు?" అడిగాను.

వాడక్కడక్కడే తిరుగుతుంటే నాకు చిరచిరలాడుతోంది.

"రా అక్కా, రా" అంటూ కేంటీన్ కు తీసుకెళ్లాడు. తానేదో అరవ పండితుడైనట్టు ఆ మెస్సు అమ్మాయితో మాట్టాడుతున్నాడు. కామాలెక్కువ, ఆమాలు తక్కువ.

"అక్కా వీళ్లకో అయిదొందలు అడ్వాన్సివ్వు" అని నాచేత ఇప్పించాడు.

మూడు వేలలో అయిదొందలు పోతే 2500. ఇప్పుడైతే ఆలోచనలకు కాస్త మేకప్ పూసి, లిప్స్టిక్కు వేసి మాట్టాడుతున్నాను కానీ, అప్పట్లో బుర్రకేమి తోస్తే అదే బయటికి అనేదాన్ని. లౌక్యమన్నది ఎరగని రాతి స్వర్ణ యుగం!

"నువ్వెప్పుడు పోతావిక్కణ్ణుంచి?"

"చుట్టుపక్కల గుళ్ళూ గోపురాలూ చూసుకుని నాల్రోజులాగి పోతా. "

"నువ్వేమైనా రిటైరయ్యావా? తీర్థ యాత్రలు చేయడానికి. తొందరగా పో "

"వెళ్తాలే అక్కా. అవసరమై కొంచం అప్పు చేశా. ఇంటి నుండి మనీ వస్తా వుంది. అది రాగానే అప్పు తీర్చేసి వెళ్తా."

"డబ్బొచ్చే వరకూ ఇక్కడే వుంటావా?"

"తప్పదుగా మరి . పోనీ నువ్వివ్వు. ఊరెళ్లగానే వెంటనే మనియార్డర్ చేస్తాను."

వాడు పోతే తప్ప వూపిరి పీల్చేది లేదని లంగ్స్ మొండికేస్తున్నాయి.

"ఎంత నీ అప్పు?"

“మెస్ బిల్ కట్టాలి, ఇంకా కొంచం బయట అప్పులున్నాయి. మొత్తం పదిహేడొందలు." అంటూ సణిగాడు.

"ఇక్కడన్నీ ఫ్రీ అన్నావు. ఊళ్లో వాళ్లు పాయసమిస్తారన్నావు. అప్పులెందుకు చేశావు?"

"నాకు పాయసం పడదక్కా. వేరే తాగుతాను."

మరి ఏం తాగుతావని అడగబోతుంటే 'నువ్వు వీడితో ఎక్కువ మాట్లాడుతున్నావే. ఇక నోరు మూసుకుని పాయింట్ కొచ్చేయి. '

బుర్రలో అలారం గట్టిగా మోగి, లోపల్నుండి రిపోర్ట్ ప్రింట్ అయి వచ్చింది.

“ఇస్తా కానీ, ఒక కండిషన్. వెంటనే బండెక్కుతానంటేనే.”

“ఇప్పుడే వెళ్లిపోతా.”

2500– 1700= ? ఎంత? ఎంతబ్బా?

‘ఇంచుమించుగా, మచ్చుపిచ్చుగా– వెయ్యికి ఎక్కువో తక్కువో.

వాడికి పదిహేడొందలు లెక్క బెట్టి ఇచ్చా. నా దగ్గర ఎనిమిది వందలు మిగిలాయి.

“ఏం చేసుకోను ఇన్ని వందలు. ఏమిటింతింత డబ్బు. నన్ను పట్టుకుంది.’

నోట్లు జేబులో పెట్టుకుని "థాంక్సక్కా, లాగ్ బుక్ ఇక్కడ వదిలేసి వెళ్తాను. నాలుగు కేసులు నాక్కూడా ఎక్కించి పట్టుకురా."

"డ్రెస్సులైనా మూడు తెచ్చుకున్నా కానీ, చెప్పులొక్క జతే వున్నాయి. తెగితే కష్టం."

"సర్లే, సర్లే."

నాకిచ్చిన గదికి దగ్గర్లోనే మెస్ వుంది. వెదురు తడికెలకు నీలం రంగు వేసిన వెదురు తడికెలు. సుజాత అనే అమ్మాయి, ఆమె భర్తా, అత్తా కలిపి మెస్ నడిపేవారు. అత్తగారిని చూస్తే భయమేసేది. బరువైన విగ్రహం. ముఖానికి పసుపు. తీక్షణమైన చూపులు, సాగిపోయిన చెవులకు బరువైన బంగారు దుద్దులు వేళాడుతుండేవి.

బ్రేక్ ఫాస్ట్ కి వెళ్లినప్పుడు సుజాత నా వంక చూసి చిన్నగా నవ్వుతుండేది. మాట్లాడుకోడానికి భాష రాదు. ఆ చిన్న నవ్వులతోనే స్నేహం చేసింది. తమిళం కాస్త కాస్త అర్థమయే నాటికి పక్కన ఒక కోవెల వుందనీ, చాలా మంచి గుడి అనీ

వెళ్లి రమ్మనీ చెప్తుండేది. వెళ్తానన్నట్టు తలూపేదాన్ని కానీ, హాస్పిటల్ కెళ్లాక ఆ విషయమే గుర్తొచ్చేది కాదు. పైగా పుటకతోనే భక్తిహీనత.

చాలా మిషనరీ హాస్పిటల్స్ మాదిరిగానే, ఆ హాస్పిటల్ కూడా ఎన్నో ఎకరాల అడవి వంటి ప్రదేశంలో కట్టారు. ఓపీ ఒక వేపుంటే, లేబర్ వార్డ్ మరొక వేపుండేది.

మొదటి పది రోజులూ మా ప్రొఫెసర్ గారి స్నేహితుడైన డాక్టర్ పాల్ కనిపించలేదు. ఏమని అడిగితే ఆయన సిక్ లీవు లో వున్నారని చెప్పారు. ఓ నాడు కేసుకోసం అర్థం రాత్రి వస్తుండగా త్రాచు పాము కరిచిందట. పాదం సెప్టిక్ అయిందని చెప్పారు. ఆ విషయం విన్నదగ్గర్నుండీ రాత్రి డ్యూటీ కెళ్లేప్పుడు ధనా ధనా అని అడుగులేస్తూ పోయేదాన్ని. నా అడుగులకు దగ్గర్లో పాములన్నీ దూరం జరిగి పారిపోతాయని నా ఆలోచన. సొంతూరి పెద్ద డాక్టర్నే కాటేసిందంటే, ఇహ పొరుగూరి పిల్ల డాక్టర్ని నేనంటే ఏం లెక్క.

నేను చేరిన పదోరోజున కాలికి కట్టుతో కుంటుకుంటూ వచ్చారు. డాక్టర్ పాల్ ఎమ్మానుయేల్ గైనిక్ చీఫే కాదు ఆ హాస్పిటల్ డైరెక్టరు కూడా. చాలా గొప్ప డాక్టరని చుట్టు పక్కల చాలా పేరు. విపరీతమైన అంకితభావం. పేదవారికి అతి తక్కువ ఖర్చుతో ఎలా వైద్యం చేయొచ్చే చెప్పేవారు. అప్పట్లో ఆయన పెద్దాపరేషన్ చేస్తే అయే ఖర్చు కేవలం 130 రూపాయలు మాత్రమే.

అంత రద్దీ హాస్పిటల్లో కూడా డెలివరీకి వచ్చే ప్రతి స్త్రీకి ఎంతో శుభ్రత పాటించేలా జాగ్రత్తలు తీసుకునేవారు. అవన్నీ ఆయన పెట్టిన నియమాలే. శుభ్రతలోనూ, స్టాండర్డ్స్ తోనూ ఎక్కడా రాజీ పడని వాతావరణంలో ఆపరేషన్లు జరిగేవి. తక్కువ ఖర్చుతో పేదవారికి మెరుగైన వైద్యం.

బయట, ఆయన్ని చూస్తే అంత హాస్పిటల్ కు డైరెక్టరని, గొప్ప డాక్టరని అనుకునే అవకాశమే వుండదు. ఆ ఆనవాళ్ళేమీ అతికించుకునే మనిషి కాదాయన. లూజుగా వేళాడే టెర్లిన్ చొక్కా. కళ్ల జోడు. ఆకు చెప్పులు. మా చిన్నప్పటి ఎలెమెంటరీ స్కూలు మాష్టర్లు గుర్తొచ్చేవారు.

పొద్దున్న ఏడింటికి ఆపరేషన్లు మొదలు పెడితే, సాయంత్రం నాలుగయ్యేది. అరుపులు, తిట్లు హడావుడి లేకుండా మౌనంగా నేర్పించేవారు మాకు ఆపరేషన్ టెక్నిక్.

ఆపరేషన్లయాక మెస్ కు వెళ్తే రసం మాత్రం వుండేది. నల్లని మట్టి పాత్రలో మిరియాల రసం. పైన కొత్తిమీర తేలుతూ వుండేది. చల్లటి దుడ్డు బియ్యపు అన్నంలో ఆ రసం పోసుకుని తింటుంటే, మానవ జన్మ ఎందుకెత్తానో తెలిసిపోయింది. అసలా రసం కోసమే మరొక్క సారి ఆ వూరెళ్లాలనిపిస్తుంటుంది.

మరీ వట్టి రసంతో తింటున్నానని, సుజాత, ఆమ్లెట్ వేసి తెచ్చేది. రసభంగమౌతుందంటే వినదూ.

అక్కడ ఒక చల్లని పాల రాతి ప్రార్ధనాలయముండేది. గాలరీ వలె పాలరాతి మెట్లుండేవి. ప్రతి వుదయం డ్యూటీకి వెళ్లబోయే ముందు అందరూ అక్కడ సమావేశమయే వారు. దారిలో వర్షానికి తడిసిన పొన్న పూలను కోటులో వేసుకెళ్లి చివరి మెట్టు మీద కూర్చునేదాన్ని. ప్రార్ధనకి పాటలు పాడే వారు. మొదట ముగ్గురు నర్సులు మొదలెట్టే వారు. చక్కని ట్యూన్. పాటకు అర్ధమేమిటో తెలిసేది కాదు. రెండు మూడు నిముషాల తర్వాత హాల్లో అందరూ గొంతు కలిపేవారు.

సెలయేటిలో చేమంతుల ప్రయాణం వంటి పాట. నన్నెక్కడికో తీసుకెళ్లిపోయేది. ప్రార్థన పూర్తయే సమయానికి మనసంతా దయతో నిండిపోయేది. కళ్ళు సరస్సులయేవి. ఆ ప్రేమ ఎవరి మీదైనా కురిపిస్తే తప్ప భారం తీరదని తెలుస్తుండేది.

నాతో తెచ్చుకున్న పొన్న పూలను, కనిపించని ఎవరికో సమర్పించి అందరికంటే ముందుగా లేచి బయటకు వచ్చేదాన్ని. ఎవరైనా పలకరిస్తారేమో, అతి సాధారణ సంభాషణలతో, నా నిశ్చలమైన సరస్సుని చెదరగొడతారేమోనన్న భయంతో హాస్పిటల్ వైపు త్వర త్వరగా వెళ్లిపోయేదాన్ని.

మాకు ట్రెయినింగ్ ఇచ్చేందుకు ఇద్దరు డాక్టర్లుండేవారు.డా.డిమ్, డాక్టర్ డే అని సిక్కిం నుండి వచ్చారట. కేంపస్ లోనే క్వార్టర్స్లో వుండేవారు. డా. డే పనితనం చూస్తే పరశురాముడంతవోడు అన్న పదం గుర్తొచ్చేది. సన్నగా పొడుగ్గా, నేపాలీ పోలికలున్న బక్క మనిషి. ఏమైనా తింటాడో లేడో. అతనికి తోడు డాక్టర్ డిమ్. పెద్దక్కలా వుండేది. ఆమె పద్ధతి, నవ్వు, మాటలూ , పని నేర్పించే తీరు అన్నీ పెద్దక్క లానే. అలుపెరగని గడియారపు ముళ్లలాగా పని చేసేవారు.

ఎంతటి క్లిష్టమైన సర్జరీ అయినా సరే వాళ్లకవి లేత గుమ్మడికాయలే. “ అమ్మో ఈ పేషంటు బతుకుతుందా ?” అని నా కాళ్ళు వణికే కేసుల్ని అయిదో ఆరో నిముషంలో తేల్చేసి, వెంటనే రెండో పని మీద పడేవారు. ఎవరికో జీవం పోస్తున్నామనో, ప్రాణదాతలమన్నట్టో ఫోజులెరగరు.

“అలిసిపోయానబ్బా, ఐ యాం టైర్డ్” అనడమే రాదు. సోకు తెలియని మనుషులు.

రాత్రి పూట లేబర్ రూంలో జడివాన కురిసేది.

పిల్లల జడివాన.

అయిదో ఆరో టేబుల్స్ వుండేవి. ఒక్కటీ ఖాళీ వుండేది కాదు. తల్లుల అరుపులు , అవి ఆగగానే పిల్లల ఏడుపులు.

కాన్పు కష్టమైనపుడు ఆపరేషన్ చేయవలసి వస్తే ఒక్క రెండు నిముషాల్లోనే ఆపరేషన్ టేబుల్ మీద వుండేది. అంత త్వరగా పేషంట్ ని షిఫ్ట్ చేసేవారు సిబ్బంది. డాక్టర్ డే , ఏదైనా పెద్ద ప్రొసీజర్ చెయ్యబోతుంటే ఛాన్సివ్వమని బతిమాలేదాన్ని.

" డే అన్నా , ప్లీజా, ఇది నన్ను చెయ్యనివ్వవా”

“నువ్వింకా చిన్నదానివి. ప్రతిదానికీ ఎగబడకూడదు.”

అంతే! నా ముఖాన్నీ, మూతిని దుఃఖంతో చుట్ట చుట్టేసి ముంగిలాగా, మాట్టాడకుండా దూరంగా నిలబడేదాన్ని.

"కోపమొస్తే చాలు, ఈ అమ్మాయి గోడకానుకుంటుంది డా. డిమ్” అని చెప్పి నవ్వేవాడు.

“సరే , రా మాట వినవుగా” అంటూ ఇన్స్ట్రుమెంట్ చేతికిచ్చి చేయించేవాడు.

జాగ్రత్తగా చేస్తే సంతోష పడి మెచ్చుకునేవాడు.

ప్రతిరోజూ వుదయం అయిదున్నరకు తెరిపిచ్చేది, కాన్పుల వాన. మళ్లీ స్నానం చేసి ఏడున్నరకు ప్రేయర్ హాలుకెళ్లాలి. కాసేపు పడుకోవాలని శరీరం ఏడిచేది.

“సరే చావు” అని అని దగ్గర్లో వున్న డ్యూటీ రూమ్ కెళ్లేదాన్ని. పేరుకే అది డ్యూటీ రూమ్, కానీ నిజానికదొక సామాన్ల కొట్టు. అన్ని సామాన్లలోకీ ఒక చెక్క బెంచీ, పడుకోడానికి అనువుగా వుండేది.

పడుకున్న వెంటనే స్వర్గం వంటి నిద్ర. కాసేపటికి పాదమ్మీద మెత్తటి స్పర్శ. ఆ తర్వాత సన్నని తాడు ఏదో పాకుతుండేది. ఎలక, దాని తోక. ‘అమ్మో ఎలక. లేవాలి. కెవ్వు మనాలి. అంటాను. తప్పకుండా అంటాను. ఇదిగో, ఒక్క నిముషం నిద్రపోయి, లేచి కెవ్వుమంటాను.’

మళ్ళీ అది కాళ్ళా గజ్జా ఆడుతోంది. దూరాన కిచ కిచ మంటోంది. ‘కెవ్వు మనడానికి నువ్వు లేవవేమే?’ అని మెదడు అరుస్తుండేది.

“ఇదిగో, లేస్తున్నా. తప్పకుండా కెవ్వు మంటా."

అద్భుతమైన చిన్న ప్రపంచం. తిండి , నిద్రా, సౌకర్యం అన్నీ తక్కువే, సంతృప్తి తప్ప.

నాలుగు రోజుల్లో నా పోస్టింగ్ అయిపోతోందనగా నన్ను తన క్వార్టర్స్ కు రమ్మని ఆహ్వానిచింది డా. డిమ్. వాళ్ల పిల్లలకు బుడ్డి బుడ్డి బొమ్మలు, మిఠాయిలు కొనుక్కుని వెళ్ళాను. పెద్ద కూతురికి తొమ్మిదేళ్లుంటాయేమో. ఆఖరి బిడ్డను వుయ్యాల్లో వేసి వూపుతోంది.

డాక్టర్లందరికీ వరసనే, ఒకే రకమైన ఇళ్లు కట్టారు. రెండు రైలు పెట్టె గదులు. వెనక చిన్న వంటిల్లు. కామన్ వరండా. దాన్నిండా చెప్పులు , సామాన్లు, గోతాములు, మూడు చక్రాల సైకిళ్లు, ఒకటి కాదు.

పక్కనే డా. డే వాళ్ల పోర్షన్ పక్కనే అనుకుంటా. కాసేపయాక చిరుగుల బనియన్ వేసుకుని బయటికి వచ్చాడు. మొహమాటంగా నవ్వాడు. రేకుల షెడ్డు పైకెక్కి సొరకాయ కోసుకుని లోపలికెళ్లాడు. మళ్లీ బయటికి వచ్చి జెర్మన్ సిల్వర్ డేకిసాతో నీళ్లు తీసుకెళ్లాడు, థియేటర్లో నాకంటికి పరశురాముడనిపించే డా. డే.

చేతిలో ఇంత పనితనం వుండి ఏమిటీ జీవితాలు. ఎక్కడైనా ప్రాక్టీసు పెట్టుకోవచ్చు కదా అంటే , డి ఎన్ బి డిగ్రీ రావాలనేవారు.మాకు పీజీ ఎలాగో ,వారికా డి ఎన్ బి అలాగ.

డా. డిమ్ తాపీగా నాతో కబుర్లాడుతోంది. తనొక గొప్ప సర్జన్ అని, తనకున్న సామర్థ్యానికి అతిశయం వొలకబోసుకోవచ్చన్న విషయం కూడా తెలియనంత మామూలుగా. కాసేపయ్యాక, పిల్లలొచ్చి, ఆకలంటూ తల్లి మీద పడ్డారు, ఏవన్నా పెట్టమని.

కిచెన్ లోకెళ్ళి ఆమ్లెట్ వేసుకొచ్చింది. రెండు క్షణాల్లో తినేశారు. నాకొక ముక్క, ప్లేట్లో పెట్టి తెచ్చింది. వెజిటేరియన్నని చెప్ప బుద్ధి కాలేదు. బలవంతాన లోపల కుక్కేశాను. బయటికి రాకుండా ముక్కూ నోరూ మూసి గట్టిగా గాలి పీల్చాను.

డా. డే ఏదో కావాలన్నట్టు గుమ్మంలోకొచ్చి, నన్ను చూసి వెళ్లబోతుంటే "పర్లేదులే, రా" అని పిలిచింది. ఓ మూడొందలు చేబదులు కావాలని తీసుకెళ్లాడు. డబ్బిచ్చి ఒక చిన్న నోటుబుక్కులో రాసుకుంది ఆ వివరాలు.

నేనెళ్లిపోతుంటే బయటి వరకూ నాతో నడుస్తూ వచ్చింది. అందరికన్నా చిన్న బిడ్డని చంకనేసుకుంది. దాని ఉబ్బు ముఖం పాలిపోయి వుంది. మిగిలిన పిల్లలు కూడా నడుస్తూ తోడు వచ్చారు. పెద్ద సైజు గౌన్లు, పోషణ లేని జుట్టు. తలలు మాసిపోయి వున్నాయి. వీళ్ళకు తలక పోసే తీరికైనా దొరుకుతుందా ఆ తల్లికి?

ఆ రోజు ఆఖరి రోజు. మధ్యాహ్నం నాలుగింటికి రిలీవ్ చేశారు. రేపుదయం బస్సెక్కి కోయంబతూర్ వెళ్లి అక్కణ్ణుంచి మణిపాల్ వెళ్లి పోవడమే. మళ్లీ ఇటువంటి హాస్పిటల్లో పనిచేసే అవకాశం వస్తుందనుకోను. తిరిగి వస్తుంటే మనసంతా పొన్న పూల పరిమళం నిండింది.

"బాగుంది. నాకు చాలా బాగుంది."

తల పైకెత్తి చెట్లమీద పక్షులకు చెప్పాను. పనీ పాటా లేని వసంత కాలపు కోయిల బదులిచ్చింది.

కోయిలెక్కడుందో కనిపెట్టాలని మెడ ఎత్తి హాస్పిటల్ ఆవరణలోని చెట్ల వంక చూస్తున్నా. గుబురు చెట్లు. రోజూ ఈ చెట్ల నీడలో తిరిగాను. ఒక్కనాడైనా కన్నెత్తైనా చూడలేదు. ముదురు పచ్చ ఆకుల్లో ఆ నల్లకోయిల ఎక్కడుందో?

గది కొచ్చేశాను. రోజూ లంచ్ కెళ్లే టైమది. ఎందుకిప్పుడా లంచ్. తినేసి ఎక్కడి పరిగెత్తాలి గనక.

'ఆ రోజు రాత్రంతా నిద్రపోవచ్చు. పొద్దున్నే లేవక్కర్లేదు. కేసొచ్చిందని పిలుపులు రావు. స్టోర్ రూములో బెంచీమీద నిద్ర, ఎలుకలు. వాటి తోకలు! అన్నిటికీ సెలవు.'

అనుకుంటే దిగులు దూలమొకటి నెత్తిన పడ్డట్టనిపించింది. సుజాత వచ్చి, ఓ ప్లేటులో అరటికాయ బజ్జీలు, టీ తీసుకు వచ్చి నేను కూర్చున్న పిట్ట గోడ మీద పెట్టింది. సుజాతకేమైనా ఇవ్వాలి అనిపించింది.

'ఏమివ్వాలి, ఏమిస్తే బాగుంటుంది?' అని ఆలోచిస్తుంటే,'బహుమతులు సరే, అసలు మెస్ బిల్లు కట్టాలి కదా' అని తట్టింది.

హఠాత్తుగా కంగారయింది. బిల్ ఎంతయి వుంటుంది. అసలు నా దగ్గరెంతుందో. గబగబా గది తలుపు తీసి బేగ్ తీసి చూసుకున్నా. రాజేష్ కు అప్పివ్వగా, మిగిలిన ఎనిమిది వందల్లో ఆ ఖర్చూ, ఈ ఖర్చూ పోగా, మూడొందల ముప్పై మిగిలింది.

బస్సు టికెట్ తీసుకోవాలి, ఆ డబ్బుతోనే. టీ గ్లాసు కడిగి సుజాత దగ్గరకెళ్లాను. "సుజాతా, మెస్ బిల్లు." అన్నాను.

చూరులో పైన దాచిన చీటీ తీసిచ్చింది. వంకర టింకరగా రాసిన 1160 రూ. ఆ చీటీ చూడగానే గుండె దడ వచ్చింది.

'అవునూ , వెళ్లిన వెంటనే డబ్బు పంపిస్తానన్న రాజేష్ ఏడీ, పంపలేదే?'

చీటీ వంక చూస్తూ నిలబడ్డ నాతో "ఇక ద్యూటీ లేదుగా, ఇవాళైనా గుడికెళ్లూ" అంది సుజాత.

తలూపాను.

"కోవెలకు చీర కట్టుకో." ఆనాడు కూడా వెళ్లనేమోనని చెయ్యి మీద చెయ్యి వేసింది.

నవ్వు తెచ్చి పెట్టుకుని, "వెళ్తా" అన్నాను.

పనిలో పడి, రాజేష్ అప్పు తీసుకున్న విషయమే మర్చిపోయాను. నెల అయిపోయినా పంపలేదంటే ఇంకేం పంపుతాడు. సొంతగా డబ్బు మేనేజ్ చేయడమదే మొదటి సారి. అసలీ విషయమే గుర్తు రాలేదేమిటి. రేపుదయమే ప్రయాణం. ఇంతలోకి ఎవరిస్తారు డబ్బు.

డాక్టర్ డిమ్, డాక్టర్ దే ఇద్దరూ గుర్తొచ్చారు. అంత డబ్బు వాళ్లెక్కణ్ణుంచి సర్దుతారు. చిన్న జీతాలు, పెద్ద సంసారాలు. కాళ్లూ చేతులూ ఆడలేదు. ఎవర్నడగ్గలను ఈ వూరికాని వూళ్లో.

సుజాతకేమని చెప్పాలి? దేవుడా. ఇక్కడికి వస్తూ ఒకే ఒక చీర తెచ్చుకున్నాను. పసుప్పచ్చని సాదా చీర. స్నానం చేసి చీర కట్టుకుని బయటికొస్తే, కొద్ది దూరంలో నిలబడి వుంది సుజాత. నేనెప్పుడు బయటికి వస్తానా అని చూస్తున్నట్టుంది.

నన్ను చూడగానే దగ్గరకొచ్చి పైనుండి కింది వరకు చూసి చిరునవ్వు నవ్వుతూ బాగున్నావంది. దిగులుగా థాంక్స్ చెప్పాను.

కోవెలకెటు వెళ్లాలో చెప్పింది.

నీరసంగా నడుచుకుంటూ పోయాను. నడుస్తున్నా, గుడిలో పంపు దగ్గర కాళ్ళు కడుక్కుంటున్నా, ప్రదక్షిణాలు చేస్తున్నా ఒకటే ఆలోచన.

'మెస్ బిల్ ఎలా కట్టాలి?'

ఇంటికెళ్లగానే డబ్బు పంపిస్తానని సుజాతతో చెప్తే ?సుజాత సరే. వాళ్ల అత్తెందుకొప్పుకుంటుంది.  తప్పకుండా గొడవ చేస్తుంది. ఆలోచిస్తూ గుడి మండపంలోకి వచ్చాను. మొక్కుబడిగా అమ్మవారికి నమస్కారం చేసి, రాతి స్థంభానికి ఆనుకుని కూర్చున్నా. లోపలికి తొంగి చూశాను. ముదురాకు పచ్చ పట్టు చీరకు ఎర్రంచు పట్టు చీర కట్టుకుని కూర్చుంది అమ్మ వారు.  మెడనిండా నగలు.  పెదవులు నవ్వుతున్నాయి.

"సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సార్థకే

శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్థుతే" అని వినిపిస్తుంటే, మనసులో దుఃఖం పొంగుతోంది. నూటికో, కోటికో గుడికెళ్లినపుడు, దేవుణ్ణి చూస్తూ 'మరి విషయం తెలుసుగా' అని మనసులో అనుకునేదాన్ని. అంతే, మర్నాడు పేపర్లో, నాకు పట్టులేని ప్రశ్నలు కనిపించేవి కాదు.

మా వూరి ఆంజనేయుడంతటి దయామయుడు. ఈమెతో 'విషయం తెలుసుగా' అందామనుకుంటే, ఆమెకు నా భాష, బాధ ఏం అర్థమవుతుంది. అర్థమైతే అసలింత చిక్కులో పడేస్తుందా? అలా నవ్వుతూ కూర్చుంటుందా?

'నాకేం తెలుసని ఇలా చేశావు. వాడొకడు. అప్పు తీసుకెళ్లాడు. ఐపు లేడు. డబ్బుల మేనేజ్ చేసుకోవడం, ఇవన్నీ నాకేమైనా తెలుసా చెప్పు? డివైనిటీ సరే, నీకు హ్యూమానిటీ అయినా వుండొద్దా? ఇవాళ నేను అన్నం తింటానేమో చూడు." ఉక్రోషంతో మనసులోనే అమ్మవారితో పోట్లాడుతున్నాను.కంట్లో దుమ్ము పడ్డట్టు కన్నీరొచ్చి నిలబడింది. ఆవిడమీద అలిగినట్టు, ఎటో చూస్తూ కూర్చున్నాను.అలకబూనడానికి పునాది , తీర్చడానికెవరో వస్తారన్న నమ్మకమే.

ఎవరో ఆడవాళ్లు తలలో పూలతో, మెట్లమీద నవ్వులు విరజిమ్ముతూ వెళ్తున్నారు. ఇంకెవరో ఒక ఆకులో వేడి ప్రసాదం తెచ్చి చేతిలో పెట్టి వెళ్లారు. జీడి పప్పు, మిరియాలూ రెండూ వున్న ప్రసాదం.

మనుషుల్లో ఎంత ప్రేమ. నన్నంటుకోవద్దని కూర్చున్నా సరే, దగ్గరకొచ్చి మరీ ఇస్తుంటారు. బాసింపెట్టు వేసుకుని, రాతి మండపం పై ఆకు దొన్నె పెట్టి శ్రద్ధగా తిన్నాను. ప్రసాదం అయిపోయింది.

లోపలికి చూసి 'మరి వెళ్లొస్తా' అన్నాను. మరీ బాగోదనుకుని గంట మోగించా. ముందున్నంత అలక లేదు.

ఆమె కూడా మౌనంగానే చూస్తోంది. హాస్పిటల్లోకి కాళ్ళీడుస్తూ 'సుజాతతోనూ, వాళ్లత్తతోనూ చెప్పేస్తాను.

ఏదైతే అదవుతుంది.' అనుకుంటూ  వెళ్తుంటే ఎవరో పిలిచినట్లైంది. డా. పాల్ ఎమ్మానుయేల్ గారు.

సరుకులేవో తెచ్చుకుంటున్నారేమో , చేతిలో సంచీ వుంది. ఉల్లిపాయలు తొంగి చూస్తున్నాయి.

"రేపు వెళ్తున్నావటగా."

"అవును సార్."

"సర్టిఫికేట్ రెడీ చేశాను. ఆఫీసుకు రా. ఇస్తాను." అన్నారు.

ఆయనతో పాటు వెళ్ళాను. ఆఫీసు గదిలో కూర్చోబెట్టారు. సర్టిఫికేట్ మీద సంతకం పెట్టి ఇచ్చారు.

దాన్ని చేతిలో పట్టుకుని " థాంక్ యూ సార్." అన్నాను. ఎంత లేదన్నా నీరసమే ధ్వనిస్తోంది.

'ఆయన వద్ద నేర్చుకున్న గొప్ప గొప్ప విషయాలకు మరీ అంత నీరసంగానా? తప్పు కాదూ.' అనిపించింది. లెంపలేసుకుని, మనసులోనే గురువుగారి పాదాలంటాను.

టేబుల్ సొరుగు లాగి, అందులోంచి ఒక కవర్ తీసి నా చేతికిచ్చారు.

"ఇదేమిటి సార్?""నెలరోజులు పనిచేశావు కదా. స్టైపెండ్. మూడువేలు."

'మూడువేలే? ఇంత డబ్బేమి చేసుకోవాలి? ఈ డబ్బేమిటిరా బాబూ, వదలదూ'

గుండెలోంచి తారాజువ్వలా సంతోషమొచ్చింది.

❦❦❦

మర్నాడుదయం సుజాత వచ్చింది. బస్సు గుడి దగ్గర ఆగుతుందట. నాతో పాటు అక్కడి వరకూ వచ్చింది, బస్సెక్కించడానికి.

ఒక సారి గుడిలోకెళ్లొస్తానని చెప్తే, నా సామాను చూస్తూ నిలబడింది.

లోపలికెళ్లి గంట కొట్టాను. పట్టు చీర అమ్మవారివి, అవే చూపులు, అదే నవ్వు. అమ్మకి అన్ని భాషలూ వచ్చు.

పిల్లల బాధలు భాష అయితే మరీను. 'ఊః , వెరీ వెరీ సారీ, నిన్న ఏవేవో అన్నాను. ఎనీ వే, చాలా హెల్ప్ చేశావు. థాంక్యూ. చాలా థాంక్స్.' తలకాయొంచుకుని చెప్పాను.

మొహమాట పడుతూ నమస్కారం చేసి తిరిగి వస్తూ మరో సారి తొంగి చూసి 'సరే వెళ్తాను. డాక్టర్ డిమ్ కి, డాక్టర్ డే కి శాపాలు తీసెయ్యి. నీకు తెలుసో లేదో. వాళ్లు గంధర్వ సర్జన్లు. పాపం వాళ్లని కొంచం చూడు'

బస్సు కదలబోయేటపుడు , కిటికీ లోంచి చేయి చాపితే షేక్ హేండ్ కోసమని సుజాత చేయిచ్చింది. రబ్బర్ బాండ్ వేసిన చిన్న పేపర్ చుట్ట సుజాత చేతిలో పెట్టి "చీర కొనుక్కో" అన్నాను.

బస్ నిలబడి వుండగా ఇస్తే తీసుకోదు ఆ అమ్మాయి.

*(వచ్చే నెల మరో అనగనగా.....)*

Post your comments